క్లుప్తంగా

ఉపకార వేతనాలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం సిటీ: పట్టణ పరిధి డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు లెంక జోషిత, వావిలపల్లి హాసిని విజయనగరం వీకే ఫౌండేషన్ అందించే ఉపకార వేతనాలకు ఎంపికయ్యా రని హెచ్‌ఎం మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. అనాథ, విద్యలో ప్రతిభకనబరిచిన విద్యార్థులను గుర్తించి కెనరా బ్యాంకు సౌజన్యంతో వీకే ఫౌండేషన్ డిగ్రీ వరకు ప్రతీ నెల రూ.వెయ్యి చొప్పున అందించనున్నారని చెప్పారు. విద్యార్థినులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు శాంతికుమారి, రుంకు శ్రీనివాసరావు, రామకృష్ణ, బంగారయ్య, తదితరులు అభినందించారు.

నేడు ఆటోల బంద్


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్లు

రామభద్రపురం: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్త ఆటోల బంద్‌ను మండల ఆటో కార్మికులు విజయవంతం చేయా లని సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో ఆటో యూనియన్ నాయకులు చొక్కాపు లోకేష్, గంగయ్యతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు.ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వచ్చేనెల 1న ఇస్తామని ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో ఆటో కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లు కె.సంజీవ్, కె.వెంకటరమణ, ఆర్.రామకృష్ణ,సోములు,తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు లేకుండా చూడండి


డిజిటల్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న డీడీఓ కిరణ్‌కుమార్

బొబ్బిలిరూరల్: ఏపీ సేవాపోర్టల్ ద్వారా సచివాలయాల్లో అందిస్తున్న సేవలకు ప్రజల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చెల్లించాలని,బకాయిలు పేరుకుపోకుండా చూడాలని డిజిటల్ అసిస్టెంట్లకు డీడీఓ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సేవల కోసం ప్రజలనుంచి వసూలు చేస్తున్న డబ్బులను ఎప్పటికప్పుడు బ్యాంకు ల్లో జమచేయాలన్నారు. బకాయిలు పేరుకుపోతున్నాయని, కనీసం రెండు రోజులకోసారైనా బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యేలా చూడాలని సూచించారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం..


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం మహేశ్వరరావు, తదితరులు

రాజాం: జీవకోటి మనుగడ కోసం ఓజోన్ పొరను కాపాడుకుందామని పెనుబాక గ్రామ హైస్కూల్ హెచ్‌ఎం ఏ.మహేశ్వరరావు అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని శార్వాణి విద్యార్థులకు ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న కాలుష్య కారకాల గురించి, పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓజోన్‌పొర పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాలని గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

శివ్వాంలో పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్యకార్మికులు

వంగర: మండల పరిధి శివ్వాం గ్రామంలో సర్పంచ్ బి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మంగళవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. అన్ని వీధుల్లోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం, పూడికను పారిశుద్ధ్యకార్మికులు తొలగించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

విజృంభిస్తున్న దోమల దండు

- కానరాని నివారణ చర్యలు
- గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- దోమతెరల పంపిణీ ఊసే లేదు
- జాడలేని ఫాగింగ్


అధ్వానంగా ఉన్న రాజాం పాత బస్టాండ్ ఆవరణ


గార్రాజుచీపురుపల్లిలో రోడ్డుమీద పారుతున్న మురుగునీరు(ఫైల్)


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా ఫాగింగ్ జరిగేది (రేగిడిలో ఫాగింగ్ చేయిస్తున్న అధికారులు)

రాజాం: వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ పరిసరాలు, బురద, మురుగునీటితో అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన వీధులుసైతం మురుగుకాలువల్లా దర్శనమిస్తున్నాయి. వీధికాలువల్లో పూడిక పేరుకుపోవడం, రోడ్లపక్కల గుట్టలుగా పడిఉన్న చెత్తకుప్పలు దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమల వృద్ధి అధికంగా ఉండడంతో అన్నిచోట్ల విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గతంలో మాదిరిగా దోమల నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం, ప్రజలకు దోమలు నుంచి రక్షణ కల్పించే మార్గాలు ప్రభుత్వం చేయకపోవడంతో ప్రజలకు ముప్పుతప్పడంలేదు. వైరల్ జ్వరాల బారిన పడి ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

అవన్నీ ఏమయ్యాయి ..?

గతంలో గ్రామాల్లో, పట్టణాల్లో క్లోరినేషన్ కనిపించేది. పెంటకుప్పలు, మురుగునీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లేవారు. తాగునీటి కుళాయిలు, బావుల్లో క్లోరినేషన్ చేయించేవారు. గ్రామాలు, పట్టణాల్లో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ జరిగేది. మురుగుకాలువల్లో దోమలగుడ్లు తినే గంబూషియా చేప పిల్ల లు విడిచిపెట్టడంతో పాటు వీధుల్లో మలాథీన్ ద్రావణాన్ని పిచికారీ చేసేవారు. ప్రతీ గ్రామంతో పాటు మురుగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఉచి తంగా దోమతెరలు పంపిణీ చేసేవారు. ఇప్పుడు ఇవేమీ కనిపించడం లేదు. ఎక్కడా క్లోరినేషన్ చేపట్టడం లేదు. గత ప్రభుత్వం అందజేసిన ఫాగింగ్ యంత్రాలు మూలకుచేరాయి. దోమ తెరల పంపిణీ గురించి ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు వైద్యకోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోంది.

నిధులు లేవు



పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు సరిపడే నిధులు లేవు. దీంతో సొంత డబ్బులు వెచ్చించి, గ్రామాల్లో దోమల నివారణ కార్యక్రమాలు చేస్తున్నాం. గతంలో మాదిరిగా ప్రభుత్వం నుంచి దోమల నియంత్రణకు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు వస్తుసామగ్రి రావడంలేదు. – బండి బోదమ్మ, సర్పంచ్, పెనుబాక, రాజాం మండలం

ఫాగింగ్ చేయాలని ఆదేశించాం



గ్రామాల్లో దోమల నివారణకు పంచాయతీలకు గతంలో ఫాగింగ్ మెషిన్లు పంపిణీ చేశాం. ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం. గతంలో మాదిరిగా బ్లీచింగ్ బస్తాల పంపిణీ, గంబూసియా చేప పిల్లల పంపిణీ వంటివి ఇంకా ప్రారంభం కాలేదు. జ్వరాలు విజృంభిస్తున్న గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నాం.
– వి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం మండలం.

జ్వర బాధితులు ఎక్కువగానే ఉన్నారు



గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కువగా టైఫాయిడ్ కేసులు, సీజనల్ జ్వరాలు కనిపిస్తున్నాయి. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. రాజాం ఏరియా ఆస్పత్రిలో ఓపీల్లో జ్వరబాధిత కేసులు అధికంగా నమోదవుతున్నాయి.
– డాక్టర్ కరణం హరిబాబు, రాజాం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

రేగిడి: సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలని ఏఓ బి.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని అంబాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులకు డ్రోన్ ద్వారా వరిపంటకు పురుగు మందులు పిచికారి చేయడంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులు సగానికి పైగా తగ్గుతాయని చెప్పారు. మందు వృథా కాదని, పంట మొత్తానికి సమానంగా మందు పిచికారీ అవుతుందని వివరించారు. రైతులు ఈ పద్ధతిని అవలంభించాలని కోరారు.సర్పంచ్ చుక్క వెంకటినాయుడు, ఏఈఓ ఎస్.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యుడి నియామకానికి చర్యలు తీసుకోండి

రామభద్రపురం: కొట్టక్కిలో పశువైద్యుడు లేక మూగజీవాలకు వైద్యసేవలు అందడం లేదని వెంటనే నియామకానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి కోరారు. కొట్టక్కి పశువైద్యశాలలో పశువైద్యుడి నియామకంపై మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం అధికారి అప్పలనాయుడుతో మంగళవారం చర్చించారు.కొట్టక్కిలో పశువైద్యాధికారి లేక పాడి రైతులు ఇబ్బందులుపడుతున్నది వాస్తవమేనని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళతానని పశువైద్యాధికారి ఆమెకు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొట్టక్కి పశువైద్యశాలలో పనిచేసే వైద్యాధికారి జూన్‌నెలలో పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారని, ఇప్పటి వరకు కొత్తగా పశువైద్యాధికారి రాకపోవడంతో పాడి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశువులకు వైద్యసేవలందడం లేదని , రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఏహెచ్‌ఏనే దిక్కవుతున్నారని చెప్పారు.ఆస్పత్రి పరిధిలో సుమారు 2 వేల వరకు పశువులు ఉన్నాయని, వైద్యసేవలు అందకపోవడంతో పాటు ఇక్క మందులు కొరత కూడా వేధిస్తోందన్నారు. పాడి రైతులు గత్యంతరం లేక మందులు బయట కొనుగోలు చేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాడి రైతు సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం పాడిరైతులకు శాపంగా మారిందని మండిపడ్డారు. ఆమె వెంట కొట్టక్కి గ్రామ సర్పంచ్ అప్పికొండ అనురాధ,ఎంపీటీసీ రమణమ్మ పాల్గొన్నారు.


మండల పశువైద్యాధికారితో చర్చిస్తున్న జెడ్పీటీసీ సరస్వతి

కల్లాం కాదు రోడ్డే...

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల రోడ్లు కల్లాలుగా మారుతున్నాయి. రైతులు మొక్కజొన్న పంటను నూర్చి గింజలను రోడ్లపై ఆరబెడుతున్నారు. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు అవకాశం లేకుండా మొక్కజొన్న గింజలను ఎండబెడుతున్నారు. పెరుమాళి జంక్షన్ నుంచి నెమలాం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డులో వి.చిన్నయ్యపేట, చుక్కవలస, నెమలాం తదితర గ్రామాల వద్ద రోడ్డుపైనే మొక్కజొన్న గింజలు ఆరబెడుతుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


చుక్కవలస వద్ద రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

తెర్లాం: పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు టీకాలు ఎంతగానో దోహదపడతాయని మండల పశువైద్యాధికారి జే.నరంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఉద్దవోలు, నెమలాం గ్రామాల్లో పశువులకు గ్రామ పశు సంవర్ధక సహాయకులు మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలను పాడిరైతులకు వివరించారు. నెమలాం పశువైద్యాధికారి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

385 పశువులకు టీకాలు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట పశువైద్య కేంద్రం పరిధిలోని రంగరాయపురం గ్రామంలో మంగళవారం 385 పశువులకు గాలికుంటవ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి హిరణ్య తెలిపారు. పాడిరైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని ఆమె సూచించారు.


తెర్లాం:ఉద్దవోలులో పశువులకు టీకాలు వేస్తున్న ఏహెచ్‌ఏలు

ఐటీఐలో మిగులుసీట్లకు దరఖాస్తులాహ్వానం

రాజాం సిటీ: స్థానిక ఐటీఐలో వివిధ ట్రేడుల్లో మిగులు సీట్లకు నాలుగో విడత దరఖా స్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నవారంతా ఈనెల 28లోగా కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొ న్నారు. అడ్మిషన్‌లకు పదోతరగతి సర్టిఫికెట్, కులధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, ఆధార్ లింకై న ఫోన్ నెంబర్, టీసీ, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని, 29న జరగనున్న కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 90000 96048, 99595 02238 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

బొబ్బిలిరూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలని డీడీఓ కిరణ్‌కుమార్ సూచించారు.గ్రామాల సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై మండల పరిషత్ కార్యాలయంలో బాడంగి,బొబ్బిలి మండలాల సర్పంచ్‌లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణను పరిశీలించేందుకు వచ్చిన డీడీఓ మాట్లాడు తూ సుస్థిర గ్రామాభివృద్ధికి సరైన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. పంచాయతీల్లో నిధుల సమీకరణ,వ్యయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులపైనే ఆధారపడకుండా స్థానిక సంస్థలు సొంతంగా నిధులను సమకూర్చుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు అల్లుభాస్కరరావు, శంబంగి రామకృష్ణ, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

రేగిడి: మండల పరిధి ఏ.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 17వ తేదీ నుంచి డివిజనల్ స్థాయి అండర్-14, 17 స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి డివిజన్ పరిధిలోని రేగిడి, రాజాం, వంగర, సంతకవిటి మండలాల్లో ఇటీవల జరిగిన మండలస్థాయి పోటీల్లో విజేతలగా నిలిచిన బాల,బాలికలకు డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

షెల్టర్ నిర్మాణం

రేగిడి: మండల పరిధిలోని కందిశ గ్రామంలో నాగావళి నది గట్టుపై ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు కెల్ల సన్యాసప్పలనాయుడు, విజయమోహన రావు, మన్మథరావు, మురళీ కృష్ణలు ఒక షెడ్డు నిర్మించారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పడవలో వెళ్లే ప్రయాణికుల కోసం ఈ షెడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. తన తండ్రి సత్యనారాయణనాయుడు జ్ఞాపకార్థం షెడ్డు ఏర్పాటుచేసినట్టు వివరించారు.


నూతనంగా నిర్మించిన షెల్టర్

యూరియా కొరతపై నిలదీత

- మండల సర్వసభ్య సమావేశంలో ఏఓపై మండిపడ్డ సభ్యులు


సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సభ్యులు

మెంటాడ: మండలంలో యూరియా కొరతపై మండల వ్యవసాయ శాఖ అధికారి గోకుల్ కృష్ణను మండల ప్రజాప్రతినిధులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతినివేదికలు చదివి వినిపించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన నివేదికలను ఏఓ గోకుల్ కృష్ణ వివరిస్తూ.. మండలానికి గతంలో కంటే 56 టన్నుల యూరియా అధికంగా వచ్చిందని చెప్పారు. ఏఓ వివరణపై పలు పంచాయతీల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. అధికంగా యూరియా వస్తే రైతులకు ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. అసలు మండలానికి ఎంత యూరియా వచ్చింది, ఏయే రైతు సేవా కేంద్రానికి ఎంత సరఫరా చేశారో చెప్పాలని సభ్యులు డిమాండ్ చేయడంతో ఏఓ సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఇద్దనవలస రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీకి సంబంధించిన టోకెన్‌లను టీడీపీ నాయకులు పంచడంపై వైస్ ఎంపీపీ ఈశ్వరరావు ఏఓను ప్రశ్నించారు.మండలంలోని రెండు పీఏసీఎస్‌లకు వచ్చిన 140 టన్నుల యూరియా ఏమైందని ఇద్దనవలస సర్పంచ్ రాయిపల్లి రామారావు నిలదీశారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని ఏఓకు సూచించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, రైతులు పాముకాటుకు గురయ్యే అవకాశం ఉన్నందున పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సాలూరు మార్కెట్ యార్డు చైర్మన్ ముఖి సూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత సత్యనారాయణకు నివాళి

రాజాం సిటీ: కార్మిక నేత ఎం.వి.సత్యనారాయణ మృతి కార్మికవర్గానికి తీరనిలోటని మండల కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. ఎం.వి.సత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ కార్మిక సిద్ధాంతం కోసం తన చివరి శ్వాసవరకు నీతి, నిజాయితీగా పనిచేసిన గొప్పవ్యక్తి సత్యనారాయణ మూర్తి అని అన్నారు. రాజాం ప్రాంతంలో కార్మికులు తీవ్ర దోపిడీకి గురవుతున్న సమయంలో కార్మికుల కోసం 1986లో సంఘం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. రాజాం జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా అనేక ఏళ్ల పనిచేసి కార్మిక, కర్షక, రైతాంగ పోరాటాల్లో ముందుండి నడిపించారని ఆయన సేవలను కొనియాడారు. మున్సిపల్ కార్మికులు లక్ష్మి, అనిల్, గురువులు, బాలరాజు, సుధాకర్, వైకుంఠ, వాసు, శంకరరావు, రవి, గోపి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

అదనపు విధులు అప్పగించవద్దని వినతి


జిల్లా పశుసంవర్ధక సహాయ సంచాలకులు సత్యప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

వంగర: పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అదనపు విధులు అప్పగించవద్దని, పనిభారం తగ్గించాలని డెమొక్రటిక్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడుగుబెల్లి కిరణ్‌కుమార్ కోరారు. వంగరలో మంగళవారం పర్యటించిన జిల్లా పశుసంవర్ధక సహాయ సంచాలకులు సత్యప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పశువులకు వైద్యానికి సంబంధించి కాకుండా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు పశువైద్య సిబ్బందిని వినియోగించడం సరికాదని అన్నారు. ఇతర విధులకు సిబ్బందిని వినియోగిస్తుండడం వల్ల పశువులకు వైద్య సేవలు అందించడంలో ఆటంకం కలుగుతుందన్నారు.పీ-4 సర్వే, క్లస్టర్ మ్యాపింగ్, రేషన్ కార్డుల పంపిణీ, రెవెన్యూ సర్వేలు, బీఎల్‌ఓ విధులు, తదితర బాధ్యతల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. పశువైద్య సిబ్బంది చక్రధర్, భాస్కర్, మనోజ్, భాగ్యరాజ్, స్వాతి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

రాజాం: మండలంలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు(ఎస్‌డబ్ల్యూపీసీల)ను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. కంచరాం, పొగిరి, పెనుబాక తదితర గ్రామాల్లో వీటిని పరిశీలించి క్లాప్‌మిత్రలతో మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా కంపోస్టు పిట్‌లలో వేయాలని, తడి చెత్త ద్వారా కంపోస్టు తయారు చేయాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో మహిళలకు పరిసరాల పరిశుభ్రత, గ్రామాల్లో స్వచ్ఛత అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులున్నారు.


కంచరాంలో తడి, పొడిచెత్తను వేరుచేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఉద్యానవన పంటలకు సాగుకు ప్రాధాన్యం


ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఏపీఓ సాయిరామ్

బాడంగి: ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు పనులకు బదులుగా ఉద్యానవన పంటల సాగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీఓ సాయిరామ్ సూచించారు.స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్, క్షేత్రసహాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 70 ఎకరాల మేర పొలం గట్లపై రైతులతో పండ్ల మొక్కలు నాటించాలని చెప్పారు. పంట సంజీవిని పేరుతో పొలం పాండ్లు తవ్వకానికి అంచనా విలువలు తయారు చేయాలని ఆదేశించారు.పంచాయతీకి 180 వరకు కంపోస్టు పిట్‌ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ప్రతీ పనిని ఎస్ఎంఎంఎస్ ద్వారానే నమోదుచేసి బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని, వేతనదారులకు ఈకేవైసీ చేయించాలని సూచించారు. మండలానికి 55 మినీగోకులాలు మంజూరయ్యాయని, ఆసక్తి ఉన్న రైతులు పశువైద్యాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ ఈసీ హరినారాయణ పాల్గొన్నారు.